క్లుప్తంగా

ఏలూరు ఎంఈఓగా అరుణ్



ఎంఈఓకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

దెందులూరు : ఏలూరు మండల విద్యాశాఖ అధికారిగా పెదవేగి ఎంఈఓ అరుణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంఈఓగా ఉన్న డీవీ రమణ ఉద్యోగ విరమణ చేయడంతో ఎఫ్ఏసీ ఎంఈఓగా అరుణ్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎంఈఓ-1 కలపాల రవి ప్రకాష్, ఏలూరు మండల ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.

జాబ్ మేళాకు 35 మంది హాజరు



జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులతో నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. 35 మంది అభ్యర్థులు హాజరుకాగా, దివిస్ లేబరేటరీ సంస్థ ప్రతినిధి రాజేష్, కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ కె.రమేష్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సమన్వయకర్తగా జేకేసీ కోఆర్డినేటర్ టీవీఎస్ పద్మావతి వ్యవహరించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



గంగానమ్మ సేవలో తరిస్తున్న భక్తులు

ఏలూరు (టూటౌన్): స్థానిక 28వ డివిజన్ బీడీ కాలనీ చెరువుగట్టుపై ఉన్న శ్రీ గంగానమ్మ ఆలయ 15వ వార్షికోత్సవం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ గంగానమ్మ, శ్రీ పోతురాజు ఆలయంలో సోమవారం తెల్లవారు జాము నుండే లోక కల్యాణార్థం గంగానమ్మ విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల అమ్మవారి నామస్మరణతో మారుమరోగింది.

నాడు సాధికారత.. నేడు దగా

- వైఎస్సార్ సీపీ హయాంలో మహారాణులుగా మహిళలు
- ఏలూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు
- 1,89,110 మందికి చేకూరిన రూ.1,687 కోట్ల లబ్ధి
- మహిళల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ హయాంలో మహిళల ఖాతాలకు నేరుగా పథకాల లబ్ధి జమయ్యేది. దీంతో వారి కొనుగోలు శక్తి ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. తమ సొంత అవసరాల కోసం భర్త, తండ్రి, కొడుకు, మామ ఇలా మగవారిపై ఆధారపడే అవసరం లేకుండా ప్రభుత్వం అందించే సహకారంతో ధీమాగా ఉండేవారు. ప్రస్తుత పరిస్థితి పూర్తిగా గతానికి భిన్నంగా మారింది. ఏ పథకమూ రాక, చిల్లిగవ్వ జమ కాక తిరిగి మగవారిపైనే ప్రతి విషయానికి ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ఏలూరు నియోజకవర్గం పరిధిలోని మహిళల్లో కొనుగోలు శక్తి సన్నగిల్లింది.

ఏలూరు (టూటౌన్) : సామాజిక సాధికారతే లక్ష్యంగా నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక బృహత్తర సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసింది. ప్రతి మహిళా ఏటా కనిష్ఠంగా రూ.50 వేలు నంచి గరిష్ఠంగా రూ.లక్ష వరకు ప్రభుత్వం నుండి లబ్ధి పొందారు. దీంతో తమ ఆర్థిక అవసరాల కోసం మగవారిపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా మహారాణులుగా చెలామణి అయ్యారు. నేడు అందుకు భిన్నంగా గత ఏడాది కాలంగా అమలు కాని హామీలతో దిగాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకాకపోవడంతో మహిళలు డీలాపడుతున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకూ నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సాయం, మహిలలకు బస్సులో ఉచిత ప్రయాణం,, ఇంట్లో ఎంత మంది చదువుకుంటున్నా ఒక్కొక్కరికీ అమ్మ ఒడి పథకంలో రూ.15వేలు చొప్పున అందిస్తామని చేసిన ఆర్భాటపు వాగ్దానాలేవీ నెరవేరకోపవడంతో మహిళలు తాము మోసపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు అన్ని వర్గాల్లోనూ ఆనందం

వైఎస్సార్ చేయూత, జగనన్న చేదోడు, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ పింఛన్ కానుక, ఆసరా, కాపు నేస్తం, అమ్మఒడి, ఈబీసీ నేస్తం, పంటల బీమా, రైతు భరోసా వంటి 27 సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తూ బడుగుల అభివృద్ధికి బంగారు బాటలు వేసింది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.



62: డ్వాక్రా ప్రాంతీయ సమావేశంలో పాల్గొన్న మహిళలు

ఐదేళ్లలో ఏలూరు నియోజకవర్గంలో చేకూరిన లబ్ధి ఇలా..	
ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ)	రూ.958.72 కోట్లు
పరోక్ష నగదు బదిలీ (నాన్ డీబీటీ)	రూ.729.04 కోట్లు
మొత్తం లబ్ధి	రూ.1,687.76 కోట్లు

ఏలూరు నియోజకవర్గంలోని 79 సచివాలయాల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రూ.958,72,38,563, పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) ద్వారా రూ.729,03,92,844 కలిపి మొత్తం రూ.1687,76,31,407 ప్రయోజనం చేకూరింది. మొత్తం లబ్ధిదారుల సంఖ్య 1,89,110 మంది ఉన్నారు. నియోజకవర్గంలోని ఓటర్లలో దాదాపు 90 శాతానికి పైగా ప్రజలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందింది. నియోజకవర్గంలోని 29,592 మందికి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం అందించింది. దీంతో ప్రజల్లో ఆనందాలు, సంతోషాలు వెల్లివిరిచాయి. ఇది కదా సంక్షేమ పాలన అంటూ నాడు ప్రజలు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు నీరాజనాలు పలికారు. అబద్ధపు హామీలతో అందలమెక్కిన కూటమి నేతలు ఏ ఒక్క హామీని నిలబెట్టుకోకుండా తమను మోసం చేశారంటూ ఏలూరు నగరంలోని మహిళలు వాపోతున్నారు.

నేడు వ్యాపారాల వెలవెల

వైఎస్సార్ సీపీ హయాంలో నిత్యం కొనుగోలుదార్లతో సందడిగా కన్పించే వ్యాపారాలు నేడు వెలవెలబోతున్నాయి. నాడు ప్రతి మహిళ ఖాతాల్లోకి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీ అయ్యేది. మహిళలు తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలుకు మార్కెట్‌కు తరలి వచ్చేవారు. కొనుగోలుదార్లతో వ్యాపారాలు కళకళలాడేవి. నేడు అందుకు భిన్నంగా పరిస్థితి మారింది. మహిళల వద్ద రూపాయల్లేకపోవడంతో కొనుగోలు చేసే పరిస్థితి లేదు.



కాపు నేస్తం పథకంలో సొమ్ము జమకావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు (ఫైల్)



రుణాలపై చర్చించుకుంటున్న మహిళలు (ఫైల్)

మహిళలకు పథకాల ద్వారా అందిన లబ్ధి		
పథకం	లబ్ధిదారులు	పొందిన లబ్ధి
ఆసరా	32,672	రూ.99,78,10,972
అమ్మ ఒడి	23,703	రూ.78,17,68,000
ఈబీసీ నేస్తం	879	రూ. 5,27,40,000
కాపు నేస్తం	1,824	రూ.10,94,40,000
సున్నా వడ్డీ	5,620	రూ.9,99,40,454
వైఎస్సార్ చేయూత	13,944	రూ.103,18,56,000
ఇళ్ల స్థలాలు	29,592	

మహిళల జీవితాల్లో వెలుగులు



నాడు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల మహిళల జీవితాల్లో వెలుగులు వెల్లివిరిచాయి. అనేక పథకాలతో ప్రతి ఇంటిలోనూ రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకూ లబ్ధి చేకూరింది. ఇదంతా నాటి సీఎం జగన్ దళిత మహిళల పట్ల చూపిన ఆదరణ, అభిమానానికి నిదర్శనం. దానికి భిన్నమైన పాలన నేడు రాష్ట్రంలో నడుస్తుంది.

– బి.జయలక్ష్మి, గృహిణి, తాపీ మేస్త్రి కాలనీ, ఏలూరు

నాడు ఆర్థిక ఇబ్బందుల్లేవు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు సాయం అందించారు. మా పిల్లల చదువుకు ఇబ్బంది ఉండేది కాదు. ఆసరా పథకంలో డ్వాక్రారుణాలు మాఫీ అయ్యాయి. బ్యాంకుల ద్వారా పెద్ద ఎత్తున డ్వాక్రా రుణాలు అందించారు. నిత్యం చేతిలో నగదు ఉండేది. ఆర్థిక ఇబ్బందులు ఉండేవి కాదు. నేడు అందుకు భిన్నంగా పరిస్థితి తయారైంది.

– సీహెచ్ సాయినిర్మల, గృహిణి, ఆముదాల అప్పలస్వామి కాలనీ, ఏలూరు

విప్లవాత్మక మార్పులకు జగన్ శ్రీకారం



గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ప్రత్యక్ష నగదు బదిలీ వల్ల బలహీన వర్గాల్లో కొనుగోలు శక్తి పెరిగింది. చిన్న చిన్న అవసరాలకు వేరే వారి వద్ద చేతులు చాపే పద్ధతి పోయింది. వెనుకబడిన వర్గాల్లో ఇంత మార్పుకు కారణమైన జగన్‌కు ధన్యవాదాలు. ప్రస్తుత పరిస్థితి గతానికి భిన్నంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం.

– జిజ్జువరపు విజయనిర్మల, కార్పొరేటర్, నగరపాలక సంస్థ, ఏలూరు

అనుమతుల్లేని విద్యా సంస్థలపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): అనుమతుల్లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్పందన కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఏలూరు నగరంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు భవనాలు ఇంకా పూర్తికాకుండానే ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ పాఠశాలలకు అనుమతులు సరైన సమయంలో రాకపోతే విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు గ్యారెంటీ ఇస్తారని ప్రశ్నించారు. వెంటనే ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని పాఠశాలల పేర్లను డీఈఓ అధికారికంగా ప్రకటన విడుదల చేయాలని కోరారు. అనుతుల్లేకుండా ఎన్ఆర్‌పేట గ్రాండ్ ఆర్య హోటల్ రోడ్లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాఠశాల ఆవరణలో బుక్స్, యూనిఫామ్స్ అమ్ముతున్న పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, ఇ.సాయి పాల్గొన్నారు.



స్పందనలో వినతి పత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ప్రజలను మోసం చేసిన కూటమి సర్కారు

- రేపు వెన్నుపోటు దినం
- పోస్టర్ విడుదల చేసి జయప్రకాష్

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ఆరోపించారు. పార్టీ స్థానిక కార్యాలయంలో సోమవారం వెన్నుపోటు దినం పోస్టర్‌ను పార్టీ నేతలతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈనెల 4న వెన్నుపోటు దినంగా పాటిస్తూ ఏలూరు నగరంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు జేపీ తెలిపారు. ఎన్నికల్లో ఇష్టారాజ్యంగా ప్రజలకు హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ‘నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.18 వేలు’ అంటూ మహిళలకు మాయమాటలు చెప్పిన కూటమి నేతలు నమ్మి ఓట్లు వేసిన ప్రజలను, మహిళలను వెన్నుపోటు పొడిచారని వివరించారు. ఈనెల 4న ఉదయం 9.30 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయం నుంచి భారీ ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్‌కు చేరుకుంటుందని తెలిపారు. పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లాలోని పార్టీ శ్రేణులు, బాధితులంతా హాజరుకావాలని కోరారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, కిలాడి దుర్గారావు, గంటా మోహనరావు, ఇమ్మానుయేల్ జయకర్, పల్లి శ్రీనివాస్, జిజ్జువరపు విజయనిర్మల, లంకలపల్లి గణేష్, ఎస్కే షమీం, స్టాలిన్, సుముద్రాల చిన్ని, కంచుమర్తి తులసీ, జనార్ధన్, బత్తిన మస్తాన్‌రావు, గంటా సాయిప్రదీప్, ఇనపనూరి జగదీష్, ఎస్కే బాజీ, కిలారపు బుజ్జి, బాస్కర్ల బాజీ, తంగెళ్ల రాము, లక్ష్మీకుమార్, దేవరకొండ నాగేశ్వరరావు, బాలాజీ, అట్టాడ రామకృష్ణ, బళ్ల రమేష్, ఉయ్యాల గణేష్, మద్దాల ఫణి, బుజ్జమ్మ, సత్యదేవ్, బత్తిలి నాగేశ్వరరావు, కొవ్వాడ దుర్గారావు, లక్కలబత్తిన ఏసుపాదం, బత్తుల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



పోస్టర్ విడుల చేసిన జయప్రకాష్, నాయకులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	34	బీన్సచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	48
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	44	బీట్‌రూట్	36
బీరకాయలు	--	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40-48	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	22	అల్లం	60
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	26	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	24
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	38
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	09
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	02
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	10
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

8న సమాఖ్యల విలీన సభ



విలీన సభ కరపత్రం విడుదల చేసిన కార్యకర్తలు, నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 8న విశాఖపట్నంలో నిర్వహించే రెండు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యల ఏపీ రాష్ట్ర స్థాయి విలీన సభను విజవంతం చేయాలని కోరుతూ ముద్రించి కరపత్రాన్ని సోమవారం స్థానిక వీవీ నగర్ ఏరియాలో ఏలూరు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు పల్లి గంగరాజు ఆధ్వర్యంలో విడుదల చేశారు. సమాఖ్య ఏలూరు గౌరవ అధ్యక్షుడు యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలుకు పాలకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసి, దళిత, మైనార్టీ, మహిళల చట్టాలను కాలరాస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామిక హక్కులపైనా ఉక్కుపాదం మోపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఘడసాల రాంబాబు, అరుణోదయ కళాకారులు ముంగం అప్పారావు, కునుపూడి నాగేశ్వరరావు, మీసాల నాగరాజు, నకిరెడ్డి లక్ష్మణ, కళ్లం నాని, తదితరులు పాల్గొన్నారు.

30వ రోజుకు వేసవి విజ్ఞాన తరగతులు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సోమవారం 30వ రోజుకు చేరాయి. ఉదయం విద్యార్థులకు వజ్రాలనిధి - నలుగురు మిత్రులు, తెలివైన కుందేలు వంటి నీతి కథల్లో నీతిని వివరించారు. రిసోర్స్ పర్సన్ ఐ.శ్రీనివాసరావు వీరే మనకు స్ఫూర్తి ప్రదాతలు కార్యక్రమంలో నిక్ వుజిసిక్, జోనిఎరిక్సన్ తదితరుల విజయం గురించి వివరించారు. అనంతరం స్వర్ణాంధ్ర - 2047 అనే అంశంపై వ్యాస రచన పోటీలను రిసోర్స్ పర్సన్ జీవీ ఆనందరావు నిర్వహించారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి సందీప్ కుమార్, ఎండీ అస్లాంపాషా, ఎం కనకదుర్గ పాల్గొన్నారు.

సర్వే పునః ప్రారంభం

సాక్షి స్పందన

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం-కన్నాపురం మెయిన్ రోడ్డు సర్వేను పలు శాఖల ప్రభుత్వ అధికారులు సోమవారం పునః ప్రారంభించారు. సాక్షి పత్రికలో గత నెల 28వ తేదీ ప్రచురితమైన పీజీఆర్ఎస్ తీరు అపహాస్యం అనే శీర్షికపై స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి పరిష్కార చర్యల నేపథ్యంలో 31వ తేదీ సర్వేకు ఉపక్రమించారు. రెవెన్యూ, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సర్వే చేపట్టగా సర్పంచ్ ముప్పిడి విజయకుమారి అభ్యంతరంతో సర్వే ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచి పోయింది. ఈ నేపథ్యంలో ఎఫ్ఎంబీ ఉన్న ప్రకారం సర్వే కొలతలు అధికారులు పునః ప్రారంభించారు. సర్వే ప్రక్రియ పూర్తయిందని రోడ్డు విస్తరణ అంశం కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఉంటుందని ఆయా శాఖల అధికారులు పేర్కొన్నారు. కొవ్వూరు, జంగారెడ్డి గూడెం, తాడేపల్లిగూడెం జాతీయ రహదారులను, డ్రెయినేజీతో సహా దుకాణదారులు ఆక్రమించారనీ వాటిపై కూడా ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు దృష్టి పెట్టాని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అనేక పర్యాయాలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

చింతలపూడి: జిల్లాను మలేరియా రహితంగా మార్చాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా లార్వీసైడ్ మందులు స్ప్రే చేయాలన్నారు. డ్రై డేలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్.మాలిని, చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎస్‌పీ ప్రసాద్, రాఘవాపురం, ఎర్రగుంటపల్లి వైద్యాధికారులు కె.నరేష్, చైతన్య, ఎంపీహెచ్ఈవో శ్రీనివారరావు, సూపర్‌వైజర్లు రవి, ప్రమీల కుమారి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హాస్టళ్లలో నూరు శాతం అడ్మిషన్లకు కృషిచేయాలి

చింతలపూడి : 2025-26 విద్యా సంవత్సరంలో నాలుగు మండలాల పరిధిలో గల హాస్టల్స్‌లో నూరు శాతం విద్యార్థినీ, విద్యార్థులు అడ్మిషన్లు తీసుకునే విధంగా కృషి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ఎం ముక్కంటి ఆదేశించారు. సోమవారం సహాయ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చింతలపూడి పరిధిలోని చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం వెల్ఫేర్ అసిస్టెంట్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం హాస్టళ్లలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ సాంఘిక సంక్షేమాధికారి ఎ.మంగారత్నం, నాలుగు మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలని వినతి

బుట్టాయగూడెం: షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ పీవీ చలపతిరావుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు ఏఎస్సార్ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అన్ని రకాల కట్టడాలు తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నారని అదే విధంగా ఏజెన్సీలోని కట్టడాలు కూడా తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ కోసం తప్పని తిప్పలు

దెందులూరు: రేషన్ కోసం రెండో రోజు షాపుల వద్ద మహిళలు క్యూ కట్టారు. మండలంలో 17 పంచాయతీలు 41 రేషన్ షాపులు ఉన్నాయి. ఏడు రేషన్ షాపులకు డీలర్లు లేరు. ఈపోస్ మిషన్లకు సర్వర్ పని చేయకపోవడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ వాహనంలో రేషన్ తీసుకువచ్చి ఇచ్చేవారని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విధానం రద్దు చేయడం వల్ల మళ్లా షాపులకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని వృద్ధులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.